క్లుప్తంగా

ప్రజా సమస్యల పరిష్కారానికి చర్యలు



అర్జీలు స్వీకరిస్తున్న మున్సిపల్ కమిషనర్ అనూష

కందుకూరు: ప్రజా ఫిర్యాదుల కార్యక్రమం ద్వారా వచ్చిన అర్జీల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్లు మున్సిపల్ కమిషనర్ కె.అనూష తెలిపారు. సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార కార్యక్రమానికి నాలుగు అర్జీలు వచ్చినట్లు తెలిపారు. పలు వ్యక్తిగతమైన సమస్యలతో పాటు, రోడ్లు, డ్రైనేజీలు, పారిశుధ్యం వంటి సమస్యలపై ఫిర్యాదులు వచ్చాయని తెలిపారు. పట్టణంలోని సమస్యలను 9177700267 నంబర్‌కు ఫోన్ చేసి తెలియజేయవచ్చునని, ఈ అవకాశాన్ని పట్టణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

విద్యుత్ తనిఖీల్లో రూ.2.83 లక్షల జరిమానా



తనిఖీలకు సంబంధించి సమీక్ష నిర్వహిస్తున్న విద్యుత్ శాఖాధికారులు

సింగరాయకొండ: స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో నిర్వహించిన ప్రత్యేక తనిఖీల్లో 68 మందిపై కేసులు నమోదు చేసి రూ.2.83 లక్షల జరిమానా విధించినట్లు విద్యుత్ శాఖ ఏడీఈ యుగంధర్ తెలిపారు. ఈ తనిఖీల్లో వివిధ మండలాలకు చెందిన 36 బృందాలు పాల్గొన్నాయి. కందుకూరు విద్యుత్ శాఖ డీఈ మల్లెల నాగేశ్వరరావు, ఒంగోలు విద్యుత్ శాఖ విజిలెన్స్ డీఈ హైమావతి ఆధ్వర్యంలో తనిఖీలు జరిగాయి. ఏఈ సాంబశివరావు పాల్గొన్నారు.

రోడ్డు, కళాశాల భవనాలకు శంకుస్థాపన

కనిగిరిరూరల్: కనిగిరి, వెలిగండ్ల మండలాల్లోని పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి సోమవారం శంకుస్థాపన చేశారు. కనిగిరి మున్సిపాలిటీ పరిధిలోని శంఖవరంలో రూ.1.30 కోట్లతో నిర్మించనున్న సీసీ రోడ్డుకు ఎమ్మెల్యే ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో చైర్మన్ అబ్దుల్ గఫార్, కమిషనర్ డానియేల్ జోసఫ్, స్థానిక నాయకులు పాల్గొన్నారు. అలాగే కనిగిరి, వెలిగండ్ల మండలాల్లోని కస్తూరిబా గాంధీ బాలికల పాఠశాలల్లో నూతనంగా నిర్మిస్తున్న జూనియర్ కళాశాలల భవనాలకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు.

నేడు సోషల్ ఆడిట్ ప్రజావేదిక

లింగసముద్రం: మండలంలో మండలంలోని 2023–24 ఆర్థిక సంవత్సరంలో జరిగిన ఎన్ఆర్ఈజీఎస్ పనులపై మంగళవారం ఉదయం సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ కె.శ్రీనివాసరావు తెలిపారు. 16 పంచాయతీలో జరిగిన ఉపాధి పనులు సామాజిక తనిఖీ బృందం తనిఖీలు నిర్వహించి గ్రామసభలు ఏర్పాటు చేశారు. చివరిగా ప్రజావేదికలో సామాజిక తనిఖీ బృందం వివరలను వెల్లడించనున్నట్లు తెలిపారు. ఈ ప్రజావేదికకు అధికారులు, ప్రజా ప్రతినిధులు, అధికారులు, కూలీలు పాల్గొనాలని ఆయన కోరారు.

109 బేళ్లు తిరస్కరణ



కొండపిలో వేలం నిర్వహిస్తున్న నిర్వహణాధికారి సునీల్‌కుమార్

కొండపి: స్థానిక పొగాకు వేలం కేంద్రంలో సోమవారం నిర్వహించిన వేలంలో 109 బేళ్ల తిరస్కరణకు గురయ్యాయని వేలం నిర్వహణ అధికారి జి.సునీల్‌కుమార్ తెలిపారు. క్లస్టర్ పరిధిలోని అయ్యప్పరాజుపాలెం, నరసరాజుపాలెం, పెద్దకళ్లగుంట గ్రామాలకు చెందిన రైతులు వేలానికి 545 బేళ్లను వేలానికి తీసుకురాగా 436 బేళ్లను కొనుగోలు చేసి వివిధ కారణాలతో 109 బేళ్లను తిరస్కరించారు. గరిష్ట ధర రూ.280, కనిష్ట ధర రూ.240, సరాసరి రూ.258.32గా నమోదైంది. వేలంలో 13 కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

టంగుటూరు: స్థానిక పొగాకు వేలం కేంద్రం పరిధిలో మంగళవారం జరిగిన వేలంలో గరిష్ట ధర రూ. 281 పలికింది. ఎం. నిడమానూరు గ్రామానికి చెందిన రైతులు 440 బేళ్లను వేలానికి తీసుకురాగా 365 కొనుగోలు చేసి 75 బేళ్లను తిరస్కరించారు. కనిష్ట ధర రూ.240, సరాసరి రూ.268.83గా నమోదైంది. వేలంలో 17 మంది వ్యాపారులు పాల్గొన్నారని నిర్వహణాధికారి శ్రీనివాసరావు తెలిపారు.

ఆరుగాలం కష్టం.. మిగిలింది నష్టమే..!

- గ్రామాల్లో ముమ్మరంగా కంది పంట నూర్పిళ్లు
- తగ్గిన దిగుబడి, గిట్టుబాటు ధరలు
- సేద్యం, పెట్టుబడి ఖర్చులు కూడా రాని వైనం
- మద్దతు ధర కల్పించడంలో కూటమి ప్రభుత్వం విఫలం
- కనీస గిట్టుబాటు ధర కల్పించాలని రైతుల వేడుకోలు



పొన్నలూరులో యంత్రంతో కంది పంటను నూర్పిడి చేస్తున్న రైతులు

పొన్నలూరు: గ్రామాల్లో కంది నూర్పిళ్లు ముమ్మరంగా ప్రారంభమయ్యాయి. ఈ ఏడాది అరకొర వర్షాలతో పాటు తెగుళ్ల కారణంగా దిగుబడి తగ్గి పంట ఆశాజనకంగా లేకపోవడంతో రైతులు కనీసం సేద్యపు, పెట్టుబడుల ఖర్చులన్నా వస్తాయా లేవన్న ఆవేదన చెందుతున్నారు. ఎంతో శ్రమించి వేలాది రూపాయిలు ఖర్చు చేసి పండించిన పంటకు అనుకూలమైనా గిట్టుబాటు ధర లేకపోవడంతో నష్టాలు తప్పవని కంది రైతులు ఆవేదన చెందుతున్నారు. గత ఏడాది సకాలంలో వర్షాలు కురిసి కంది పంట అధిక దిగుబడులు రావడంతో ఈ ఏడాది కూడా రైతులు అధిక ఎకరాల్లో కంది పంటను సాగు చేశారు. ముఖ్యంగా మండలంలోని ముప్పాళ్ల, చెన్నిపాడు, కోటపాడు, తిమ్మపాలెం, ముత్తరాసుపాలెం, తిమ్మపాలెం, వేంపాడు, వెంకుపాలెం, పొన్నలూరు గ్రామాలతో పాటు పలు గ్రామాల్లో అధికంగా కంది సాగు చేశారు. గత ఏడాది ఎకరాకు 6 నుంచి 8 క్వింటాల దిగుబడి వచ్చింది. అయితే ఈ ఏడాది ఎకరాకు 2 నుంచి 4 క్వింటాల దిగుబడి వస్తుందని రైతులు తెలిపారు.

పెరిగిన ఖర్చులు, తగ్గిన గిట్టుబాటు ధరలు....

గత ఏడాది కంటే ఈ ఏడాది కంది పంట దిగుబడులతో పాటు గిట్టుబాటు ధరలు తగ్గాయని రైతులు వాపోతున్నారు. గత ఏడాది కందులు క్వింటా రూ.8 వేల నుంచి రూ.10 వేలు ఉండగా, ఈ ఏడాది రూ, 5500 నుంచి రూ, 7500 వరకు ఉన్నాయి. ఇది ఇలా ఉంటే ఈ ఏడాది కంది పంటకు పెట్టుబడి ఖర్చులు బాగా పెరిగాయి. ఎకరా భూమి కౌలు రూ.15 వేలు, ట్రాక్టర్ సేద్యం రూ.2 వేలు, విత్తనాల కొనుగోలు రూ.3 వేలు, కోతకూలీ, నూర్పిడి యంత్రం బాడుగకు రూ.5 వేలు ఇలా ఎకరాకు మొత్తం ఖర్చు రూ.25 వేల నుంచి రూ.30 వేలు వరకు అయ్యింది. కంది పంటకు గిట్టుబాటు సరిగా లేకపోవడంతో పాటు దిగుబడులు కూడా అనుకున్న స్థాయిలో రాకపోవడంతో నష్టాలు చవిచూడాల్సి వస్తుందని రైతులు అంటున్నారు.

కొండపి నియోజకవర్గంలో మండలాల వారీగా కంది పంట సాగు...	
మండలం	సాగుచేసిన ఎకరాలు
పొన్నలూరు	1210
మర్రిపూడి	1400
జరుగుమల్లి	800
కొండపి	1110
టంగుటూరు	750
సింగరాయకొండ	600

కంది రైతులకు బాగా నష్టం



ఈ ఏడాది కంది రైతులకు బాగా నష్టం వచ్చింది. ఎకరాకు 6 క్వింటాలకు పైగా దిగిబడి రావాలి. కానీ వర్షాభావ పరిస్థితి, తెగుళ్లతో సరైన దిగుబడులు రాలేదు. సొంత పొలం ఉన్న రైతుకు ఎకరాకు సుమారుగా రూ.20 వేల వరకు, కౌలు రైతుకు రూ.30 వేలకు పైగా పెట్టుబడి ఖర్చులు అయ్యాయి. ప్రస్తుతం కంది పంట దిగుబడి ఎకరాకు 2 నుంచి 4 క్వింటాలు మాత్రమే వస్తుంది. పెట్టుబడి ఖర్చులు కూడా వచ్చే పరిస్థితి లేదు. ప్రభుత్వం సరైన మద్దతు ధర కల్పించి కంది రైతులను ఆదుకోవాలి. – బూసిరెడ్డి శ్రీనివాసులురెడ్డి, రైతు, తిమ్మపాలెం

కందుల కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు



వర్షాభావ ప్రభావంతో కంది పంట పూత దశలోనే కొంత మేర దెబ్బతింది. దీంతో ఈ ఏడాది అనుకున్న స్థాయిలో దిగుబడి లేక రైతులు నష్టాలు చవిచూడాల్సి వచ్చింది. పండించిన పంట దళారుల పాటు కాకుండా రైతులను ఆదుకోవడానికి ప్రభుత్వం కందుల కొనుగోలు కేంద్రాలను ప్రతి మండలంలో ఏర్పాటు చేసింది. నాణ్యమైన కందులకు కనీస మద్దతు ధర రూ.7550 వరకు కల్పిస్తున్నారు.రైతులు సద్వినియోగం చేసుకోవాలి. – టి పూర్ణచంద్రరావు, ఏవో, పొన్నలూరు

పాలనలో కూటమి ప్రభుత్వం విఫలం

- బూటకపు హామీలతో గద్దెనెక్కారు..
- స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధంగా ఉండండి
- వైఎస్సార్ సీపీ కనిగిరి ఇన్‌చార్జి దద్దాల నారాయణ



దద్దాల, కదిరిని సన్మానిస్తున్న నేతలు

సీఎస్‌పురం(పామూరు): వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు సమష్టిగా, సమన్వయంతో పని చేసి వచ్చే ఎన్నికల్లో కనిగిరి కొండపై వైఎస్సార్ సీపీ జెండాను ఎగురవేసి మరోమారు జగనన్నను ముఖ్యమంత్రి చేసుకుందామని పార్టీ కనిగిరి నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ దద్దాల నారాయణయాదవ్, మాజీ ఎమ్మెల్యే కదిరి బాబూరావు అన్నారు. స్థానిక సీఎస్‌పురంలోని ఆర్ఎంఎస్ కల్యాణ మండపంలో సోమవారం పార్టీ నూతన మండల అధ్యక్షుడు పాలుగుళ్ల మల్లికార్జునరెడ్డి అధ్యక్షతన పార్టీ మండల కమిటీల ఎంపిక సందర్భంగా మండలంలోని 23 గ్రామ పంచాయతీల పరిధిలోని నాయకులు, కార్యకర్తల సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ దద్దాల నారాయణయాదవ్ మాట్లాడుతూ పార్టీ అధినేతమాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు, జిల్లా అధ్యక్షుడు బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, పార్లమెంట్ ఇన్‌చార్జ్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, కారుమూరి నాగేశ్వరరావు నేతృత్వంలో మండల కమిటీలను నియమిస్తున్నామన్నారు. మాజీ ఎమ్మెల్యే కదిరి బాబూరావు, రెడ్డి కార్పొరేషన్ మాజీ చైర్మన్ చింతలచెరువు సత్యనారాయణరెడ్డిల సలహాలు సూచనలతో మీ అందరి సలహాలు సూచనలతో జగనన్నను సీఎం చేసేందుకు మీలో ఒక్కడిగా పనిచేస్తానన్నారు. ఎన్నికలవేళ బూటకపు సూపర్ సిక్స్ పథకాలపేరుతో ప్రజలను మభ్యపెట్టి టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందన్నారు.

10 మాసాల పాలనలోనే తిరుబాటు

రాష్ట్ర ప్రభుత్వం అధికారం చేపట్టి 10 మాసాల్లోనే ఇచ్చిన హామీలు అమలుచేయకపోవడంతో ప్రభుత్వం ప్రజలు తిరుగుబాటుకు సిద్ధమవుతున్నారని, సూపర్ సిక్స్ పథకాలు బోగస్ అని కేవలం ఎన్నికల స్టంట్‌మాత్రమేనన్నారు. శ్రేణులు ఐక్యతగా ఉండాలని టీడీపీ నాయకులకు భయపడాల్సిన పని లేదని, తాము అండగా ఉంటామన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికలతో విజయభేరి మొదలుపెడదాం

పార్టీ నాయకులు, కార్యకర్తలు అందరం ఒక్కటిగా పనిచేసి రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయ దుందుబి మోగిద్దామని మాజీ ఎమ్మెల్యే కదిరి బాబూరావు అన్నారు. వచ్చే ఎన్నికల్లో మరోమారు జగన్‌మోహన్‌రెడ్డి సీఎం కావడం ఖాయమన్నారు. తనపై వస్తున్న అపోహలు నమ్మవద్దని రాజకీయాల్లో ఉన్నంతకాలం జగన్‌మోహన్‌రెడ్డితోనే ఉంటానని, వైఎస్సార్‌సీపీ విజయానికి పనిచేస్తానన్నారు. ఈ సందర్భంగా పార్టీ నూతన మండల అధ్యక్షుడు పాలుగుళ్ల మల్లికార్జునరెడ్డిని ఇన్‌చార్జ్ దద్దాల పరిచయం చేశారు. అనంతరం మండల అధ్యక్షుడు, జడ్పీటీసీ, వైస్ ఎంపీపీలు ఇన్‌చార్జ్ దద్దాల నారాయణయాదవ్, మాజీ ఎమ్మెల్యే కదిరి బాబూరావులను ఘనంగా సన్మానించారు. తొలుత స్థానిక చెరువు వద్ద నుంచి ఫంక్షన్‌హాల్ వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మేకల శ్రీనివాసులు, గుంటక తిరుపతిరెడ్డి, వైస్ ఎంపీపీ దుగ్గిరెడ్డి ప్రతాప్‌రెడ్డి, భూమిరెడ్డి ప్రభంజనా వెంకటరెడ్డి, పార్టీ నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు పులి శాంతీగోవర్ధన్‌రెడ్డి, తమ్మినేని సుజాత, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ముత్యాల నారాయణరెడ్డి, పార్టీ మాజీ మండల అధ్యక్షుడు భువనగిరి వెంకటయ్య, నారాయణస్వామి ఆలయ మాజీ చైర్మన్ దుగ్గిరెడ్డి జయరెడ్డి, జి.ఆదినారాయణరెడ్డి, బైరెడ్డి తిరుపతిరెడ్డి, మేకల బాలు, కోఆప్షన్ మహబు, టీయూటీ జిల్లా అధ్యక్షుడు మితికాల గురవయ్య, మైనారిటీసెల్ రాష్ట్రకార్యదర్శి షేక్.బుజ్జి, ఎస్.ప్రకాష్‌రెడ్డి, బసివి చంద్రశేఖర్, ఇండ్లా బాలయ్య, బత్తుల దేవరాజ్, చల్లా రాఘవులు, జి.చంద్రశేఖర్‌రెడ్డి, పులి మాల్యాద్రి, సిద్దు రమణారెడ్డి, వెంకటరెడ్డి, ముదుమాల నారాయణరెడ్డి, తోట అశోక్ తదితరులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

విద్యార్థులకు మంచినీటి వసతి



పాఠశాలల్లో మంచినీటి వసతిని ప్రారంభిస్తున్న చైర్మన్ అబ్దుల్ గఫార్

కనిగిరిరూరల్: కేఎస్ఎం ఎడ్యుకేషనల్ సొసైటీ, గుడ్ హెల్ప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పలు పాఠశాలల్లోని విద్యార్థులకు మంచినీటి వసతి కల్పించారు. ఈసందర్భంగా సంస్థ చైర్మన్, మున్సిపల్ చైర్మన్ గఫార్ మాట్లాడుతూ బంగారు బాల్యం-వాటర్ బెల్ కార్యక్రమంలో భాగంగా కాశీపురం, కాశిరెడ్డి నగర్, దేవాంగ నగర్, టకారి పాలెం, ప్రభుత్వ పాఠశాలల్లో ఏర్పాటు చేశామన్నారు. గుడ్‌హెల్ప్ ప్రతినిధి మంద్రు రమేష్, హెచ్ఎం కే పద్మావతి, ఉపాధ్యాయులు శైలజ, వి.కల్పన, ఎస్‌కే కరీమున్నీసా పాల్గొన్నారు.

– ప్రతి ఒక్కరూ శారీరక, మానసిక ఆరోగ్యంపై అవగాహన కల్గి ఉండాలని మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్ అన్నారు. న్యాయ సేవాధికార సంస్థ, వివిధ స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో న్యాయ సేవాధికార సంస్థ సిబ్బంది, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆస్తి పన్ను రాయితీ సద్వినియోగం చేసుకోండి

కనిగిరిరూరల్: మున్సిపాలిటీ పరిధిలో గృహాల వారు 2025–26 ఆర్థిక ఏడాదికి సంబంధించి ముందస్తుగా ఆస్తి పన్ను చెల్లించిన వారికి 5 శాతం రాయితీ కల్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసినట్లు కమిషనర్ డానియేల్ జోసఫ్ తెలిపారు. 2025–26కు సంబంధించి ఇంటి పన్ను ఖాళీ స్థలం , పన్నుల మొత్తాన్ని ఏకమొత్తంగా ఈ నెల 30వ తేదీ లోగా చెల్లించిన వారికి 5 శాతం రాయితీ ఇస్తామన్నారు. ఇంటి పన్నును మున్సిపల్ కార్యాలయంలో, సచివాలయంలో చెల్లించవచ్చన్నారు. ఈ అవకాశాన్ని గృహ యజమానులు సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ కోరారు.

కందుకూరు రూరల్: మండలంలోని 19 పంచాయతీల్లో 2023–24 ఆర్థిక సంవత్సరంలో జరిగిన ఉపాధి హామీ పనులపై మంగళవారం ప్రజావేదిక నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ పి.రత్నజ్యోతి తెలిపారు. ఎన్ఆర్ఈజీఎస్ కార్యాలయం వద్ద మధ్యాహ్నం 2 గంటల నుంచి ప్రజావేదిక నిర్వహిస్తారన్నారు. గ్రామంలో సామాజిక తనిఖీ బృందం ఉపాధి పనులపై తనిఖీలు నిర్వహించి గ్రామసభల ఏర్పాటు చేసి అక్కడ సేకరించిన అంశాలపై ప్రజావేదికలో వెల్లడించనున్నట్లు పేర్కొన్నారు. ప్రజావేదికకు ప్రజా ప్రతినిధులు, కూలీలు, అధికారులు హాజరుకావాలని ఆమె కోరారు.

టంగుటూరులో శాంతియుత ర్యాలీ



టంగుటూరులో ర్యాలీ నిర్వహిస్తున్న పాస్టర్లు

టంగుటూరు: పాస్టర్ ప్రవీణ్ పగడాల మృతికి వారి కుటుంబానికి సంతాపం తెలియజేస్తూ, పాస్టర్ అనుమానాస్పద మృతికి నిష్పక్షపాత ధోరణిలో న్యాయ విచారణ చేయాలని ప్రభుత్వాన్ని, పోలీసు యంత్రాంగాన్ని కోరుతూ శాంతియుత ర్యాలీ నిర్వహించారు. మండలంలోని యునైటెడ్ పాస్టర్స్ ఫెలోషిప్ యూపీఎఫ్ కమిటీ సభ్యులు, గౌరవ సలహాదారుల ఆధ్వర్యంలో టంగుటూరుపురం సెంటర్ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు నిరసన శాంతియుత ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో యు పీఎఫ్ కమిటీ సభ్యులు పాస్టర్ సుకుమార్, పాస్టర్ సుధీర్, పాస్టర్ జాన్, పాస్టర్ భాస్కర్రావు, పాస్టర్ డేవిడ్ లివింగ్‌స్టన్, పాస్టర్ సోహా, పాస్టర్ జయప్రసాద్, కమిటీ గౌరవ సలహాదారులు పాస్టర్ మోజెస్, పాస్టర్ యేసురత్నం, పాస్టర్ అబ్రహాం, పాస్టర్ లాజరస్, మండల క్రైస్తవులు పాల్గొన్నారు.

బంగారు తాపడ జడ సమర్పణ

కందుకూరు: కావలి పట్టణానికి చెందిన భక్తుడు చలంచాల్య సూర్యప్రకాశరావు, సీతాదేవి దంపతులు గ్రామదేవత అంకమ్మతల్లికి భారీ విరాళం అందజేశారు. అమ్మవారికి అలంకరించేందుకు రూ.1,70,000 విలువైన బంగారు తాపడ వెండి జడను సమర్పించారు. దీంతో పాటు అమ్మవారి అర్చన కోసం 110 వెండి పుష్పాలను ఆలయ ఈఓ కార్తీక్‌కు అందజేశారు. అమ్మవారికి భారీ విరాళంగా నగలు బహుకరించిన సూర్యప్రకాశరావు, సీతాదేవి దంపతులను అధికారులు అభినందనలు తెలిపారు. విశ్రాంతి ఈఓ రాంకుమార్, ఆలయ పునర్నిమాన కమిటీ సభ్యులు మంచిరాజు మురళి, గాండ్ల శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఆరోగ్యకర సమాజాన్ని నిర్మిద్దాం



పొన్నలూరులో ర్యాలీ నిర్వహిస్తున్న పీహెచ్‌సీ వైద్య బృందం

పొన్నలూరు: మంచి ఆహార నియమాలు పాటించడం వల్ల ఆరోగ్యం పొందవచ్చని పీహెచ్‌సీ డాక్టర్లు కృష్ణచైతన్య, రవికుమార్ అన్నారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకొని పొన్నలూరులో ఆదివారం ర్యాలీ నిర్వహించి అవగాహన కల్పించారు. బీడీ, సిగరెట్, చుట్టా, గుట్కా వంటి అలవాట్లు ఉన్నవారు క్యాన్సర్ బారిన పడే అవకాశం ఉందన్నారు. వ్యాయామం, మంచి ఆహారపు అలవాట్లు ఉన్న వారు సంపూర్ణ ఆరోగ్యంతో ఉండవచ్చన్నారు. డాక్టర్లు ఉమేరా, మల్లికార్జునరావు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

టంగుటూరు: ఆరోగ్యకర సమాజాన్ని నిర్మించేందుకు ప్రజలంతా సహకరించాలని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి బాలాజీ అశోక్ అన్నారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక మొమ్మల సెంటర్ నుంచి ర్యాలీ నిర్వహించి అవగాహన కల్పించారు. డాక్టర్ ప్రసాద్‌బాబు, దివ్యశ్రీ, సీహెచ్వో మాతయ్య, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ కళాశాలల్లోనే నాణ్యమైన విద్య



కనిగిరిరూరల్: పుస్తకాలు, నోట్‌బుక్‌లు అందజేస్తున్న ప్రిన్సిపాల్ రమణారెడ్డి



పొన్నలూరులో కళాశాలపై అవగాహన కల్పిస్తున్న అధ్యాపకులు

కనిగిరిరూరల్: ప్రభుత్వ కళాశాలల్లోనే నాణ్యమైన, మెరుగైన విద్య అందుతుందని ప్రిన్సిపాల్ పి.రమణారెడ్డి అన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం 2025–26 ఏడాదికి సంబంధించిన ఇంటర్ పాఠ్యపుస్తకాలను, నోట్ బుక్‌లను అందచేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ పి రమణారెడ్డి మాట్లాడుతూ విద్యతోనే బంగారు భవిష్యత్ సాధ్యమన్నారు.

కొండపి: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం ఇంటర్మీడియట్ విద్యార్థులకు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ విద్యా మిత్ర పేరుతో విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేసినట్లు ప్రిన్సిపాల్ ఎం.వెంకటేశ్వర్లు తెలిపారు. మాజీ ఏఎంసీ చైర్మన్ గొర్రెపాటి రామయ్య,కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పామూరు: సీనియర్ ఇంటర్ విద్యార్థులు టెక్స్ బుక్స్, నోట్‌బుక్స్‌ను సద్వినియోగం చేసుకోవాలని స్థానిక ఇన్‌చార్జ్ జీజేసీ ప్రిన్సిపాల్ జె.సురేష్‌రెడ్డి అన్నారు. స్థానిక జీజేసీలో సీనియర్ ఇంటర్మీడియట్ విద్యార్థులకు ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ సురేష్‌రెడ్డి అధ్యాపకులతో కలిసి టెక్స్‌బుక్స్, నోట్‌బుక్స్ పంపిణీచేశారు. జి.రమణయ్య, జబీన్‌హసన్, నాగభూషణం, రాధిక, రవికాంత్, బ్రహ్మారెడ్డి, మురళి, ప్రభాకర్, కృష్ణారెడ్డి, నాగార్జున పాల్గొన్నారు.

ప్రభుత్వ కళాశాల బలోపేతానికి కృషి చేయాలి

పొన్నలూరు: పదో తరగతి పూర్తయిన విద్యార్థులను తల్లిదండ్రులు ప్రభుత్వ జూనియర్ కళాశాల్లో చేర్పించి కళాశాల బలోపేతానికి కృషి చేయాలని ప్రిన్సిపాల్ రాజేంద్రబాబు అన్నారు. పొన్నలూరు, ఉప్పలదిన్నె పలు గ్రామాల్లో సోమవారం కళాశాల సిబ్బంది అడ్మిషన్ల కోసం కళాశాల సమాచారంతో ముద్రించిన కరపత్రాలతో ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ప్రైవేట్ కళాశాలల్లో కంటే ప్రభుత్వ కళాశాలల్లోనే అర్హులైన అధ్యాపకులు ఉంటారన్నారు. కళాశాలకు పక్కా భవనంతో పాటు అన్ని రకాల వసతులు ఉన్నాయని మండలంలో పది పూరైయిన విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

అక్రమ పట్టాలు రద్దు చేసి అర్హులకు ఇవ్వాలి



ధర్నా చేస్తున్న సీపీఎం నేతలు

హనుమంతునిపాడు: అక్రమ పట్టాలు రద్దు చేసి అర్హులకు ప్రభుత్వ భూమి పంపిణీ చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బడుగు వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో సీపీఎం నేతలు స్థానిక రెవెన్యూ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఉపాధ్యక్షుడు బడుగు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ అన్యాక్రాంతమైన ప్రభుత్వ భూములను వెంటనే ప్రభుత్వం స్వాధీనం చేసుకొని అర్హులకు మూడు ఎకరాల చొప్పున పంపిణీ చేయాలన్నారు. కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కంకణాల ఆంజనేయులు మాట్లాడుతూ హాజీపురం, మిట్టపాలెం గ్రామల పరిధిలో 550 ఎకరాల పైగా భూములు అన్యాక్రాంతమయ్యాయన్నారు. అనంతరం తహసీల్దార్ దిలీప్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. నాయకులు రాములు, ఏసోబు, కొండయ్య, గోన స్వర్ణ, నిర్మల, జ్యోతి, మరియమ్మ, నవమ్మ, ఎలిసమ్మ పాల్గొన్నారు.

తరగతి గదులు ప్రారంభం



తరగతి గదులు ప్రారంభిస్తున్న దాతలు, హెచ్‌ఎం

లింగసముద్రం: స్థానిక కేఆర్‌జెడ్పీహెచ్‌ఎస్‌లో 1966లో పిడుగు కోనయ్య,-కోనమ్మ దాతృత్వంలో నిర్మించిన తరగతి గదులు శిథిలావస్థకు చేరాయి. దీంతో వారి మనువళ్లు పిడుగు వెంకటరాజు, పిడుగు వెంకట రంగారావులు సుమారు రూ.4 లక్షల వ్యయంతో వాటిని తిరిగి పునఃనిర్మించారు. అలా నిర్మించిన తరగతి గదులను పాఠశాల పూర్వ విద్యార్థులు, విశ్రాంత ప్రిన్సిపాల్ కొట్టే వెంకటాచార్యు ప్రారంభించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం యు.మాధవరావు మాట్లాడుతూ ఈ పాఠశాలకు పూర్వ విద్యార్థులు, దాతలు ఎంతో సహకరిస్తున్నారన్నారు. అందులో భాగంగా పిడుగు వెంకటరాజు– శిరీష, పిడుగు వెంట రంగారావు– కళ్యాణి దంపతులు శిథిలావస్థలో ఉన్న తరగతి గదులను నిర్మించారన్నారు. వారిని స్ఫూర్తిగా తీసుకొని పూర్వ విద్యార్థులు, గ్రామ పెద్దలు పాఠశాలకు సహకరించాలన్నారు. హెచ్‌ఎం కె.సూర్యప్రకాశరావు, ఎంఈఓ ఎంపీ.శివకుమార్, కొట్టే వెంకటనారాయణ, కొట్టే వజ్జలయ్య, అడపా రంజన్, ఎస్ఎంసీ చైర్మన్ దగ్గు వెంకట రమేష్, కొణిదన శ్రీను, ఉమ్మడిశెట్టి నాగేశ్వరరావు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

రోడ్డు, కళాశాల భవనాలకు శంకుస్థాపన

కనిగిరిరూరల్: కనిగిరి, వెలిగండ్ల మండలాల్లోని పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి సోమవారం శంకుస్థాపన చేశారు. కనిగిరి మున్సిపాలిటీ పరిధిలోని శంఖవరంలో రూ.1.30 కోట్లతో నిర్మించనున్న సీసీ రోడ్డుకు ఎమ్మెల్యే ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో చైర్మన్ అబ్దుల్ గఫార్, కమిషనర్ డానియేల్ జోసఫ్, స్థానిక నాయకులు పాల్గొన్నారు. అలాగే కనిగిరి, వెలిగండ్ల మండలాల్లోని కస్తూరిబా గాంధీ బాలికల పాఠశాలల్లో నూతనంగా నిర్మిస్తున్న జూనియర్ కళాశాలల భవనాలకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు

వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు

శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

కందుకూరు డివిజన్

90102 24456

Office mail : sakshiongads@gmail.com